నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, ఆదివారం 18 ఫిబ్రవరి 2024 | KHAMMAM

ఖమ్మం: కేసీఆర్ జన్మదిన కేక్ కట్ చేసి సంబురాలు చేస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు, పునుకొల్లు నీరజ, కూరాకుల నాగభూషణం

కేసీఆర్ జన్మదిన సందర్భంగా బోనకల్లులోని శాంతినిలయంలో అన్నదానం చేస్తున్న జడ్పీ చైర్మన్ కమల్‌రాజు

సత్తుపల్లి రింగ్‌సెంటర్‌లో కేసీఆర్ జన్మదిన కేక్‌ను కట్‌చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

బాపు బర్త్‌డే..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి.. స్వీట్లు పంపిణీ చేసిన బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు
- నియోజకవర్గాల్లో కేక్ కట్ చేసిన ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్
- 'జై కేసీఆర్.. జైజై కేసీఆర్' అంటూ హోరెత్తిన నినాదాలు
- అనాథ, వృద్ధాశ్రమాల్లో అన్నదానం, ఆస్పత్రుల్లో బ్రెడ్లు, పాలు పంపిణీ

పాల్వంచ : మాజీ ఎమ్మెల్యే వనమాకు కేక్ తినిపిస్తున్న కంచర్ల చంద్రశేఖర్‌రావు

అశ్వారావుపేట: కేసీఆర్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే 'మెచ్చా'

కారేపల్లిలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ , ప్రజాప్రతినిధులు, నాయకులు


చింతకానిలో కొండబాలకు కేక్ తినిపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొణిజర్లలో కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖమ్మంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఖమ్మం, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ ఉద్యమ యోధుడు, అపర భగీరథుడు, పదేళ్లు రాష్ట్రాన్ని పాలించి అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించిన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు జన్మదిన వేడుకలను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ, మండల, పట్టణ, నియోజకవర్గ స్థాయిలో ఎక్కడికక్కడ పండుగ వాతావరణంలో బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు, వివిధ వర్గాల ప్రజలు కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కేసీఆర్ పేరున సేవా కార్యక్రమాలు చేపట్టారు. వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాల్లో అన్నదానాలు, ఆస్పత్రుల్లో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. మొక్కలు నాటారు. బాణాసంచా కాల్చి 'జై కేసీఆర్.. జైజై కేసీఆర్' అంటూ నినాదాలు చేస్తూ సంబురాలు చేసుకున్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురంగా జరుపుకున్నారు. భారీ కేక్‌ను కట్ చేసి నాయకులకు తినిపించారు. ఈ సందర్భంగా తాతా మధు మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర సాధన కోసం ఎన్నో పోరాటాలు చేశారన్నారు. అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి.. చివరకు తన ప్రాణాలను పణంగా పెట్టి తెలంగాణ సాధించిన గొప్ప నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణుతోపాటు పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు. అలాగే అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల్లో బీఆర్ఎస్ మండల నాయకులు కేసీఆర్ జన్మదిన వేడుకలను సంబురంగా జరుపుకున్నారు. దమ్మపేట మండల కేంద్రంలో జరిగిన వేడుకలకు అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. సత్తుపల్లి పట్టణ రింగ్ సెంటర్‌లో జరిగిన కేసీఆర్ జన్మదిన వేడుకలకు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరయ్యారు. టేకులపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన వేడుకలకు మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మెర వరప్రసాద్ హాజరై సంబురాల్లో పాల్గొన్నారు. బోనకల్‌లోని శాంతి నిలయంలో మండల పార్టీ నాయకులు కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. సారపాక మండల కేంద్రంలోని వృద్ధాశ్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కేసీఆర్ జన్మదినం సందర్భంగా వృద్ధులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. భద్రాచలం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నాయకులు భారీ కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. మణుగూరు పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జడ్పీటీసీ పాశం నర్సింహారావు, సిటీ అధ్యక్షుడు లడపా అప్పారావు ఆధ్వర్యంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు జరిగాయి. పాల్వంచ పట్టణంలో జరిగిన వేడుకలకు మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. కొత్తగూడెం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కోనేరు చిన్ని ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ ఆవరణలో కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో ఇల్లెందు జగదాంబ సెంటర్‌లో 70 కేజీల కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వివిధ మండలాల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర యూత్ ఆధ్వర్యంలో కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వెయ్యి మంది పేదలకు అన్నదానం చేశారు. కారేపల్లి, కొణిజర్లలో మాజీ ఎమ్మెల్యేలు రాములు నాయక్, బానోత్ మదన్‌లాల్ కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కువైట్‌లో ఖమ్మం జిల్లా వాసి, బీఆర్ఎస్ పార్టీ కువైట్ ఎన్నారై విభాగం అధ్యక్షురాలు అభిలాష గొడిషాల ఆధ్వర్యంలో మొక్కలు నాటి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఇల్లెందులో 70 కేజీల కేక్ కట్ చేస్తున్న జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ దండిగల రాజేందర్

వదంతులే.. వారి పాలిట శాపం

చిత్రహింసలకు గురవుతున్న ఇతర రాష్ట్రాల వలసకూలీలు

పిల్లలను ఎత్తుకుపోయేవారంటూ స్థానికుల దాడులు

భాష రాకపోవడంతో మరింత తిప్పలు

గుదిమళ్ల ఘటన మరువకముందే పోచారంలో మరో ఘటన

భయంతో వణికిపోతున్న బతుకుజీవులు

పొట్ట చేతపట్టుకొని బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాల నుంచి వలసొచ్చిన కూలీలు చిత్రహింసలకు గురవుతున్నారు. పల్లెల్లో పుడుతున్న వదంతులు వారిపాలిట శాపంగా మారాయి. చిన్నపిల్లలను ఎత్తుకెళ్లే ముఠా సంచరిస్తున్నట్లు ఇటీవల పుకార్లు ఎక్కువకావడంతో వలసకూలీల బతుకులు దయనీయంగా మారాయి. సోషల్‌మీడియా ద్వారా ఈ వదంతులు వేగంగా వ్యాప్తి చెందుతుండడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. దీంతో ఇతర రాష్ట్రాల వారు కనిపిస్తే చాలు అనుమానంతో దాడులకు పాల్పడుతున్నారు. నాలుగురోజుల క్రితం ఖమ్మంరూరల్ మండలం గుదిమళ్ల గ్రామంలో ఓ వ్యక్తిని స్థానికులు చావబాదిన ఘటన మరువకముందే కూసుమంచి మండలం పోచారంలో మరో ఘటన చోటుచేసుకుంది. మతిస్థిమితంలేని పశ్చిమబెంగాల్‌కు చెందిన వ్యక్తిని కొట్టడానికి గ్రామస్తులు సిద్ధమవ్వగా ఓ వ్యక్తి చొరవచూపి అతడిని పోలీసులకు అప్పగించాడు. ఏదేమైనా ఈ వరుస ఘటనలతో వలసకూలీలు భయంతో వణికిపోతున్నారు.

పోచారంలో మతిస్థిమితం లేని పశ్చిమబెంగాల్‌కు చెందిన ప్రదీప్

కూసుమంచి, ఫిబ్రవరి 17 : తమ రాష్ట్రాల్లో పనులు లేక బతుకుదెరువు కోసం వచ్చిన ఇతర రాష్ట్రాల కూలీలు నానాతంటాలు పడుతున్నారు. ప్రతి సంవత్సరం మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వేలాదిమంది కూలీలు మన రాష్ట్రానికి వలసవస్తున్నారు. అయితే వీరు ఉంటున్న ప్రదేశం నుంచి పొరపాటున ఇతర గ్రామాలకు వెళ్తేచాలు పిల్లలను ఎత్తుకెళ్లేవారనే అనుమానంతో ప్రజలు చిత్రహింసలు పెడుతున్నారు. ఇటీవల ఖమ్మంరూరల్ మండలం గుదిమళ్ల గ్రామంలో ఓ వలసకూలీని చితకబాదిన విషయం విదితమే. ఈ ఘటన మరువకముందే కూసుమంచి మండలం పోచారం గ్రామంలో రెండ్రోజుల క్రితం మరో ఘటన చోటుచేసుకున్నది. పశ్చిమబెంగాల్‌కు చెందిన ఓ మతిస్థిమితం లేని వ్యక్తిని కొట్టేందుకు స్థానికులు సిద్ధవ్వగా ఓ వ్యక్తి చొరవతో ప్రమాదం తప్పింది.

గుదిమళ్లలో ఏం జరిగింది?

మధ్యప్రదేశ్ నుంచి శివరాంసింగ్ అనే వ్యక్తి ముదిగొండ మండలం పండ్రేగిపల్లిలోని ఓ క్రషర్‌లో పని చేయడానికి వలసొచ్చాడు. గురువారం పనిమీద ఖమ్మం వెళ్లిన అతడు సాయంత్రం పండ్రేగిపల్లి వెళ్లేందుకు ఆటోఎక్కాడు. అయితే ఆ ఆటో పండ్రేగిపల్లి వెళ్లదని చెప్పి అతడిని గుదిమళ్లలో దింపివేశాడు ఆటోడ్రైవర్. ఈక్రమంలో తెలుగురాని శివరాం సింగ్ ఓ మహిళను అడ్రస్ అడిగాడు. దీంతో ఆ మహిళ భయపడి.. పిల్లలను ఎత్తుకెళ్లే దొంగగా భావించి దొంగా దొంగా అని కేకలు వేసింది. చుట్టుపక్కల ఉన్నవాళ్ళు వచ్చి ఆ వ్యక్తిని చితకబాదారు. తీవ్రగాయాలైన సింగ్ అపస్మారకస్థితిలోకి వెళ్లడంతో విషయం తెలుసుకున్న పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే దాడికి పాల్పడిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గుదిమళ్లలో దెబ్బలు తిన్న శివరాంసింగ్ (ఫైల్)

పోచారంలో మరో ఘటన!

మతిస్థిమితం లేని ఓ వ్యక్తి కాలినడకన శుక్రవారం కూసుమంచి మండలం పోచారం గ్రామానికి వెళ్లాడు. అతడి మానసిక పరిస్థితి బాగలేని కారణంగా గ్రామంలోని ఓ కాలనీలో చెట్లపొదల మధ్య కూర్చొని ఉన్నాడు. అతడిని గమనించిన కొందరు అనుమానంతో దొంగగా భావించి కేకలు వేశారు. తెలుగు రాకపోవడం, సమాధానం సరిగా చెప్పకపోవడంతో అతడిని కొట్టేందుకు గ్రామస్తులు సిద్ధమయ్యారు. ఈక్రమంలో గ్రామస్తుడొకరు చొరవ తీసుకొని అతడిని కొట్టవద్దని, పోలీసులకు అప్పగించాలని సూచించడంతో డయల్ 100కు కాల్ చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని ఆ వ్యక్తిని స్టేషన్‌కు తీసుకెళ్లి ఆరాతీయగా పశ్చిమబెంగాల్‌కు చెందిన ప్రదీప్‌గా గుర్తించారు. అతడు మతిస్థిమితం లేక గత కొంతకాలంగా కూసుమంచి, పాలేరు ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ వ్యక్తి చొరవతో తృటిలో ప్రమాదం తప్పింది. అయితే ఈ ముసుగులోనే పలు నేరాలకు పాల్పడుతున్న వారూ లేకపోలేదు.. అయితే ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండడంతో పాటు కొంచెం లౌక్యం, ధైర్యంతో ఆలోచిస్తే సమస్యకు పరిష్కారం దొరకకమానదు.

ఈవీఎంల 'ఎఫ్ఎల్‌సీ' సక్సెస్

ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

ఈవీఎం గోడౌన్ తాళం సీల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

మామిళ్లగూడెం, ఫిబ్రవరి17 : వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో చేపట్టిన ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్(ఎఫ్ఎల్‌సీ) విజయవంతంగా ముగిసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. శనివారం నూతన కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం, వీవీ ప్యాట్ గోడౌన్‌ను కలెక్టర్ సందర్శించారు. వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఫస్ట్ లెవల్ చెకింగ్‌లో తిరస్కరణకు గురైన ఈవీఎంలను మరమ్మతుల కోసం ఆ సంస్థకు ఎస్కార్ట్ భద్రతతో తరలించారు. తిరస్కరణకు గురైన ఈవీఎంలు కంపెనీకి వెళ్లే వరకు మార్గమధ్యలో వాహనాలను ఎక్కడ కూడా ఆపొద్దని సదరు బాధ్యులను కలెక్టర్ ఆదేశించారు. గోడౌన్‌లో ఎఫ్ఎల్‌సీ అనంతరం భద్రపరిచిన ఈవీఎం, వీవీ ప్యాట్ల గదుల తాళాలు, సీళ్లను పరిశీలించారు. సీసీ టీవీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలన్నారు. భద్రతా సిబ్బంది సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, వసతుల గురించి అడిగారు. భద్రతాపరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ హుస్సేన్, వివిధ పార్టీల ప్రతినిధులు నల్లమోతు తిరుమలరావు, జీఎస్ఆర్ఏ విద్యాసాగర్, చీకటి రాంబాబు, సింగు రాజయ్య, పాలడుగు కృష్ణప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

నేడు ఐటీడీఏ పాలక మండలి సమావేశం

భద్రాచలం, ఫిబ్రవరి 17 : ఐటీడీఏ పాలక మండలి సమావేశం భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. సమావేశానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరుకానున్నారు. మంత్రులు తొలుత రామాలయంలో పూజలు చేసిన తర్వాత ఐటీడీఏ సమావేశంలో పాల్గొంటారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

5 గంటలపాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం

బోగీని తొలగించి ట్రాక్‌ను పునరుద్ధరించిన రైల్వే సిబ్బంది

జేసీబీ సాయంతో వ్యాగన్‌ను తొలగిస్తున్న అధికారులు

చింతకాని, ఫిబ్రవరి 17 : బొగ్గు లోడుతో వెళ్తున్న గూడ్స్ రైలు ఒక్కసారిగా కుదుపునకు గురై పట్టాలు తప్పింది. ఈ ఘటన చింతకాని మండలం నాగులవంచ-బోనకల్లు గ్రామాల మధ్య 505 కిలోమీటర్ రాయి వద్ద శనివారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బొగ్గు లోడుతో గూడ్స్ రైలు ఖమ్మం నుంచి విజయవాడ వైపు వెళ్తున్నది. ఈ క్రమంలో నాగులవంచ-బోనకల్లు గ్రామాల మధ్యకు వెళ్లగానే ఒక్కసారిగా కుదుపునకు గురై పట్టాలు తప్పింది. వెంటనే అప్రమత్తమైన గూడ్స్ రైలు లోకో పైలెట్(డ్రైవర్) సమయస్ఫూర్తిగా వ్యవహరించి రైలును అక్కడికక్కడే నిలిపివేశాడు. విషయాన్ని రైల్వే శాఖ ఉన్నతాధికారులకు చేరవేశారు. రైల్వే శాఖకు చెందిన సాంకేతిక, ఎమర్జెన్సీ సిబ్బంది ప్రత్యేక రైలులో విజయవాడ నుంచి ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకున్నారు. రైలు వ్యాగన్ పట్టాలు తప్పిన ప్రదేశాన్ని పరిశీలించి జేసీబీ సహాయంతో వ్యాగన్‌లోని బొగ్గును ఖాళీ చేసి వ్యాగన్‌ను పక్కకు తొలగించారు. గూడ్స్ రైలు బోగీల లింక్‌లు కలిపి ముందుకు నడిపించారు. అనంతరం ఖమ్మం-విజయవాడ మార్గంలో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. సుమారు 5 గంటలపాటు అంతరాయం ఏర్పడింది. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు రైళ్ల ఆలస్యం కారణంగా రైల్వే స్టేషన్లలో తీవ్ర ఇబ్బందులుపడ్డారు.

మాదకద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం

- గంజాయి మత్తును వదిలించడమే ప్రధాన లక్ష్యం
- ప్రైవేటు బస్సులో ప్లాస్టిక్ సామాన్ల ముసుగులో సరుకు తరలింపు
- నాలుగు క్వింటాళ్ల గంజాయి సీజ్, 8 మంది అరెస్ట్
- విలేకరుల సమావేశంలో భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు

గంజాయి రవాణాదారుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం క్రైం/ భద్రాచలం, ఫిబ్రవరి 17: మాదకద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం మోపుతామని, యువతని పట్టి పీడిస్తున్న గంజాయి మత్తును వదిలించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎస్పీ రోహిత్‌రాజు స్పష్టం చేశారు. ప్లాస్టిక్ సామాన్ల వ్యాపారం పేరుతో సినీ ఫక్కీలో ప్రైవేటు బస్సులో గంజాయి రవాణా చేస్తున్న 8 మందిని భద్రాచలం పోలీసులు అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కొత్తగూడెంలోని తన కార్యాలయ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల ఈ వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. భద్రాచలం టౌన్ ఎస్సై పీవీఎన్ రావు తన సిబ్బందితో పట్టణంలోని ఇందిరాగాంధీ నగర్ బొమ్మ సెంటర్ వద్ద శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ప్రైవేటు బస్సును ఆపి తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో పోలీసులను చూసి ఓ వ్యక్తి భయంతో అనుమానాస్పదంగా కిందకు దిగుతుండడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో సదరు వ్యక్తితోపాటు మరో ఏడుగురు బంధువులు ఉన్నట్లు తెలిసింది. వీరికి సంబంధించిన సామాన్లను తనిఖీ చేయడంతో వారు ప్లాస్టిక్ సామాన్ల వ్యాపారం ముసుగులో తరలిస్తున్న డోర్ మ్యాట్ లోపలి భాగంలో, ప్లాస్టిక్ ట్రేల బండిల్స్ మధ్యలో గంజాయి నింపి సినీ ఫక్కీలో తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మొత్తం రూ.కోటి విలువైన నాలుగు క్వింటాళ్ల గంజాయి ప్యాకెట్లను స్వాధీనపరుచుకున్నారు. సదరు వ్యక్తులు హర్యానా రాష్ట్రంలోని పానిపట్, హిల్సార్, భవానీ ఖేదా జిల్లాలకు చెందిన బల్జీత్, రవిదాస్, సూరజ్, గీన్ను, తక్‌ధీర్, రామ్ మెహర్, సుందర్, రాజ్‌పతిగా విచారణలో తేలింది. వీరంతా కలిసి ఒడిశా రాష్ట్రం కలిమెల, మల్కాన్‌గిరి ప్రాంతాల్లో కోలా ఆనంద్ అలియాస్ బుజ్జి, బాల్‌రెడ్డిల వద్ద నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి తీసుకు వస్తున్నారు. కాగా, ఎవరైనా గంజాయి రవాణా చేస్తున్నట్లు తెలిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజు కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ పరితోశ్ పంకజ్, టౌన్ ఇన్‌స్పెక్టర్ రాయల వెంకటేశ్వర్లు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ బెల్లం సత్యనారాయణ, ఎస్సై జలకం ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.